



# నవభూమి

జిల్లా అనుబంధం

06 ఆగస్టు,2025 బుధవారం పేజీలు:7

www.epaper.navabhoomi.in




## విద్యా ప్రమాణాలు పెంచేందుకు

# పటిష్ట చర్యలు

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 8వ తరగతి చదివే ఆడపిల్లలకు సైకిళ్ల పంపిణీ
- ఏదులాపురంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు
- ఏదులాపురం మున్సిపల్ ప్రాంతంలో పర్యటించి పిఎస్ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిల్ లను పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం నవభూమిబ్యూరో, ఆగస్టు 05:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంగళవారం ఏదులాపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్, ఏదులాపురం మునిసిపల్ పరిధిలో 1వ, 59వ, 60వ డివిజన్ లలో 8వ తరగతి చదివే ఆడ పిల్లలకు సైకిల్స్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది పాలేరు నియోజక వర్గంలోని 8 నుంచి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు సైకిల్స్ పంపిణీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం 8వ తరగతి వచ్చిన బాలికలకు, ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో కొత్తగా చేరిన బాలికలకు సైకిల్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. నేడు ఏదులాపురం మున్సిపాలిటీలో, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 3 డివిజన్ కలుపుకుని 191 సైకిల్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. డ్రాప్ ఔట్ తగ్గాలని, బాలికల విద్య ప్రోత్సహించాలని వ్యక్తిగతంగా ట్రస్ట్ నుంచి అందిస్తున్నామని అన్నారు. పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు కొవ్వొత్తుల కరిగి పోతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మనల్ని చదివిస్తున్న అమ్మా, నాన్నలను గుర్తు చేసుకుంటూ మనం పెట్టుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు కృషి చేయాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని అన్నారు. విద్య, వైద్య



రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. గతంలో గురుకులాల్లో పిల్లలకు సరైన ఆహారం పెట్టలేదని అన్నారు. ఎన్నికల సమయంలో హామి ఇవ్వకపోయినా గురుకులాల దుస్థితి చూసి 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిలను పెంచామని అన్నారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను బయటకు తీసి జీవనోపాధి కల్పించేలా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసామని తెలిపారు. పాలేరు నియోజక వర్గంలో 46 కోట్లతో ఐటిఐ మంజూరు చేయడం జరిగిందని, త్వరలో తిరుమలాయ పాలెం లో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఏదులాపురంలో గత ప్రభుత్వం పేరుకు జేఎన్టియూ కళాశాల మంజూరు చేస్తే మన ప్రభుత్వం రాగానే మొదటి విడత 110 కోట్లు మంజూరు చేసామని, త్వరలో ఈ పనులు పూర్తి చేస్తామని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 200 కోట్లతో 3 వేలకు పైగా పిల్లలు చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేసుకున్నామని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ, నూతనంగా మెగా డి.ఎస్సీ ద్వారా 11 వేల ఉపాధ్యాయులను ఇందిరమ్మ ప్రభుత్వం నియమించిందని, అంతేకాకుండా 30 వేలమంది టీచర్ల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా పూర్తి చేసామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు.



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నేడు 191 సైకిల్స్ మంత్రి చేతుల మీదుగా అందుకుంటున్న విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత అందిస్తుందని అన్నారు. మన ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్ లను అన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ప్రఖ్యాత కంపెనీలతో టై అప్ చేసుకొని ల్యాబ్స్ ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. మధ్యాహ్నం భోజనం నాణ్యత ఉండే విధంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం వండే సమయంలో పొగ రాకుండా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా వంట జరిగేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. జూన్ 12న పాఠ్యాంశాలు వరకు బుక్స్ సంబంధించిన పుస్తకాలు పూర్తి స్థాయిలో అందించామని అన్నారు. ప్రైవేట్ కు దీటుగా మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలలో అందే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. పిల్లలు బాగా చదువుకుని పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ విద్యాధికారి నాగ పద్మజ, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఎంఇఓ శ్రీనివాసరావు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తగినంత యూరియా

# సరఫరా చేయాలి

- కేంద్ర మంత్రి జెపి నడ్డాకు విజ్ఞప్తి చేసిన మంత్రి తుమ్మల
- రాష్ట్రానికి కేటాయించిన విధంగా యూరియాను సప్లై చేయాలి
- ఏప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి ఇంకనూ రావాల్సి ఉన్న 2.10 లక్షల మెట్రిక్ టన్నులను కూడా ఆగస్టు మాసంలో సరఫరా చేయాలి
- కేంద్రమంత్రి జెపి నడ్డా లేఖకు ప్రతిస్పందనగా మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తిన పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో పంటల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందని అన్నారు. గత ఏప్రిల్ 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60



లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందన్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా

## ఎర్త్ సైన్స్ ఆవరణలో

# ప్లాంటేషన్ పూర్తి చేయాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**కొత్తగూడెం జూలై 5 నవభూమి ప్రతినిధి:** ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో జరుగుతున్న చెట్లు తొలగింపు, పరిసరాల క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆవరణలో నిర్మించబోవు భవనాల, కంప్యూటర్ ల్యాబ్లు, తరగతి గదులు వాటికి అనుగుణంగా ప్రదేశాన్ని చదును చేయాలని సూచించారు. యూనివర్సిటీ ఆవరణలో ఖాళీ ప్రదేశంలో విస్తృతంగా ప్లాంటేషన్



ప్రక్రియ చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే పనస, టెకోమో,తెల్ల గన్నేరు మందారం మొక్కలను విస్తృతంగా నాటాలని ఆదేశించారు. యూనివర్సిటీ ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# మాజీ మంత్రి కోనేరు వర్ధంతి సందర్భంగా, పంచాయతీ కార్మికులకు వస్త్రాలు పంపిణి






కొత్తగూడెం జూలై 5 నవభూమి ప్రతినిధి: మాజీ మంత్రి లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ స్వర్గీయ కోనేరు నాగేశ్వరావు 9 వ వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీ పంచాయితీ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోనేరు పూర్ణచంద్రరావు సతీమణి సీనియర్ లయన్ కోనేరు పద్మ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సేవలు వెలకట్టలేని వారికి ప్రభుత్వంతోపాటు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు లగడపాటి రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు మొరిశెట్టి మోహన్ రావు, కోనేరు నాగేశ్వరావు, మైనేని మోహన్ రావు, కూర శ్రీధర్, చెరుకు శ్రీనివాస్, శ్రీశైలం, జయ, కుమార్ పాల్గొన్నారు

# నిఘా నేత్రాలు నిద్రపాయే, దొంగల ఆచూకీ దొరకకపాయే



రుద్రంపూర్ ఆగస్టు 5 నవభూమి: రామవరం, అధికారుల నిర్లక్ష్యం దొంగలకు వరంగా మారింది. బాధితులు మాత్రం లబోదిబోమని ఏడ్చే పరిస్థితి దాపురించింది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని ప్రాంతాల్లో పరిస్థితి. అప్పటి సీఐ బత్తుల సత్యనారాయణ ప్రజల భాగస్వామ్యంతో సుమారు రూ.12 లక్షల వ్యయంతో టూటౌన్ పరిధిలోని రామవరం, 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, ధన్బాద్, రుద్రంపూర్, గౌతమ్ పూర్, పెనగడప, రాంపురం పంచాయతీలో 64 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ అవి క్రమంగా పని చేయకుండాపోయి కేవలం అలంకారప్రాయంగా మాత్రమే మిగిలిపోయాయి.

# గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గార్ల, నవభూమి, ఆగస్టు 5: పక్షవాతం తో బాధపడుతూనే మద్యానికి బానిసై జీవితం పై విరక్తి చెంది గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గార్ల మండలం పాత పోచారం గ్రామంలో మంగళవారం జరిగింది. గార్ల పోలీసుల కథనం ప్రకారం పాత పోచారం గ్రామానికి చెందిన షేక్ అంకున్(41) గత ఐదేళ్లుగా పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడని, దీనికి తోడుగా మద్యానికి బానిసగా మారడం, కుటుంబ పోషణ భారం కావడం తో జీవితం పై విరక్తి చెంది ఈనెల 2వ తేదీన ఇంట్లో నిల్వ ఉంచిన గడ్డి మందును కుటుంబ సభ్యులు ఎవరు లేని సమయంలో సేవించి నురగలు కక్కుతూ స్పృహ కోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడన్నారు. మృతుడి అన్న షేక్ రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గార్ల ఎస్సై రియాజ్ పాష తెలిపారు.

# బోడంపుడి 28వ వర్ధంతి సభ

తల్లాడ, నవభూమి, ఆగస్టు5: తల్లాడ లోని దొడ్డ కృష్ణయ్య భవనంలో మాజీ శాసనసభ పక్ష నాయకుడు అమరజీవి కామ్రేడ్ బోడంపుడి వెంకటేశ్వరరావు 28వ వర్ధంతి సభను ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి అయినల రామలింగేశ్వర రావు మాట్లాడుతూ బోడెంపూడి వెంకటేశ్వరరావు మరణించి 28 సంవత్సరాలు గడిచిన ఆయన చేసిన సేవలు పోరాటాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఆయన చేసిన కృషి ఫలితంగా నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రూపుదిద్దుకున్న బోడంపుడి ప్రజల స్రవంతి పథకం ఆదర్శంగా తెలంగాణ రాష్ట్ర మొత్తానికి మిషన్ భగీరథ పథకం వచ్చిందని నాడు చివరి భూములకు నీళ్లు అందకపోతే రాత్రిపూట కాలువ గట్ల వెంబడి తిరిగి ప్రతి ఎకరానికి నీళ్లు అందే విధంగా కృషిచేశారని. ఒక పాలేరుగా తన జీవితాన్ని ఆరంభించి బడిపంతులుగా పనిచేసే తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్ గా పనిచేసే జైలుకు వెళ్లి గ్రామాల్లో జమీందారుల భూస్వాముల వద్ద పనిచేస్తున్న జీత గాళ్ళ కు కు ఓ సంఘాన్ని ఏర్పాటు చేసి రాత్రిపూట సమావేశాలు నిర్వహించి వారి జీతాలు పెంచే విధంగా కృషి చేశారని. మూడుసార్లు ఎన్నికలలో ఓటమి చెందిన కృంగిపోకుండా. తనదైన శైలిలో ప్రజలతో మమేకమవుతూ తర్వాత మూడుసార్లు గెలిపొందిన పొంగుబాటు లేకుండా ప్రజల మధ్య తిరుగుతూ రైతుబంధుడుగా నిలిచిన కామ్రేడ్ బోడెంపూడి ఆయన ఆశయాలను కొనసాగించడమే మన ముందున్న కర్తవమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు నల్లమోతు మోహన్ రావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, గుంటుపల్లి వెంకటయ్య, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్, తమ్మిశెట్టి నాగమణి, మొండ్రు నాగేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

గుండాల ఆగస్టు 5 నవభూమి: ఆగష్టు 1 నుంచి 9 తారీకు వరకు ఆదివాసులు ప్రపంచం దినోత్సవంను ప్రతి గ్రామంలో జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుగులోత్ రామ్ చందర్ అన్నారు.
షెడ్యూల్ ఐదు, పెసా చట్టం, 1/70, అటవీ హక్కుల చట్టం – 2006 లను పకడ్బందీగా అములుచేయాలని అన్నారు. పెసా సభలు అనుమతి లేకుండా అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు, టైగర్ జోన్లకు ఫార్మా కంపెనీలకు, ఫీల్డ్ ఫైరింగ్ లకు కేటాయించడానికి ఆపాలని కోరారు. పోడుభూములు సాగు చేస్తున్న ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారుల దాడులును అక్రమ కేసులును తక్షణమే నిలిపివేయాలి. ఆదివాసులకు డబల్ బెదురూములు నిర్మించి ఇవ్వాలి. ఆదివాసీ గూడెలలో ఉచితంగా విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ పౌరులు పై ఆపరేషన్ కాగర్ కాన్సెప్ట్ తో అమాయక గిరిజనులను దారుణంగా ఎన్కౌంటర్ పేరుతో హత్యలు చేస్తుంది, ఇట్టి ఆపరేషన్ ను నిలిపి వేయాలని సిపిఐ ( ఎంఎల్ ) న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం ఖండిస్తుంది. ఇట్టి ప్రకటనలో పాల్గొన్న ఆదివాసులు నాయకులు, కార్యకర్తలు, సబ్ డివిజన్ నాయకులు గుగులోత్ రాంచందర్, యనగంటి భూషణం, గొగ్గేలా పాపారావు, ఊకె పగడయ్య, ఇస్లావత్ శ్రీను, మాలోత్ కృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఐఎన్టియుసి ధ్యేయం



రుద్రంపూర్ ఆగస్టు 5 నవభూమి: కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ లో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశానుసారం ఐఎన్టియుసి నాయకుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడమైనది. ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ పాల్గొని మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పలు అంశాలపై గోదావరిఖనిలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో తీర్మానించిన అంశాలను కొత్తగూడెం ఏరియా నాయకులకు తెలియజేస్తూ అందులో ముఖ్యంగా కారుణ్య నియామకాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు కొన్ని నెలలుగా అన్ఫిట్ చేయకుండా డ్యూటీ లేక కుటుంబాన్ని పోషించలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులకు మరోసారి బోర్డులో అవకాశం కల్పించాలని, సొంత ఇంటి కల, పెర్క్స్ పై ఆదాయపన్ను రాయితీ, సూటబుల్ జాబ్ ఇతర పలు సమస్యలపై చర్చించారని తెలియజేశారు. సింగరేణి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఐఎన్టీయూసీ యూనియన్ పోరాటం చేస్తుందని తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఈనెల ఏడో తారీఖున మైన్సు, ఓపెన్ కాస్ట్ మరియు డిపార్ట్మెంట్లలో ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలపాలని తెలియజేశారు. అదేవిధంగా 14వ తేదీన జిఎం కార్యాలయం ముట్టడికి ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలియజేశారు. కార్మికుల పక్షాన ఎల్లప్పుడు ఐఎన్టీయూసీ యూనియన్ పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజేశ్వరరావు, సెంట్రల్ మరియు బ్రాంచ్ నాయకులు జీదుల రాజేశ్వరావు, మేంగాని అశోక్, మల్లారపు కొమరయ్య, సీతారామరాజు, ట్రెజరర్ భీముడు, ఫిట్ కార్యదర్శులు చిలక రాజయ్య గోపి కుమార్ స్వామి, ఎండి సత్తార్ పాష, కే నట్రాజ్, మోహన్ రెడ్డి, డి శంకర్ బాబు సిహెచ్ సాగర్, మల్లికార్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంఘవిర ఐమంత్స్, బి వెంకటస్వామి, వై శంకర్, చందులాల్, బింగి గోపాల్, శ్రీమన్నారాయణ, సత్యనారాయణ, జడల చంద్రశేఖర్, భాను కమల్, కే కుమార్, క్రాంతి కుమార్, టి రమేష్, పి కృష్ణ, వల్లాల సాంబశివరావు, కొమ్ము సాంబయ్య, లక్ష్మీనారాయణ కోరి, బండి సంపత్, డేవిడ్ రాజ్, లెనిన్ బాబు, అమర్ లాల్, వేణుగోపాల్, మంగ రమేష్, ఐఎన్టియు సి వివిధ కమిటీ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మహిళా సమాఖ్య పట్టణ నూతన కమిటి ఎన్నిక, వర్కింగ్ ప్రెసిడెంటుగా భాగ్యలక్ష్మి, అధ్యక్షురాలిగా లక్ష్మి ఎన్నిక, ప్రధాన కార్యదర్శిగా షాహీన్





**కొత్తగూడెం జూలై 5 నవభూమి ప్రతినిధి:** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) కొత్తగూడెం పట్టణ శాఖ నూతన కౌన్సిల్ ఏర్పాటైంది. ఇటీవల జరిగిన పట్టణ మూడో మహాసభలో మహాసభ ప్రతినిధులు ఎన్నికున్న నూతన కౌన్సిల్ సమావేశం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో మంగళవారం జరిగింది. కౌన్సిల్ సభ్యులు నూతన ఆఫిస్, కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. సమాఖ్య కొత్తగూడెం పట్టణ గౌరవ అధ్యక్షురాలిగా మనుబోతుల శైలజ, వర్కింగ్ ప్రసిడెంటుగా పుట్టి భాగ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలిగా 21వ వార్డుకు చెందిన పైడిపల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రామవరంకు చెందిన షేక్ షాహీన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పొలమూరి ధనలక్ష్మి, గుమ్మడిల్లి కళ్యాణి, మూర్ధం కళ్యాణి, పోలోజు రమాదేవి, సహాయ కార్యదర్శులుగా మదం విజయలక్ష్మి, కాటారి అరుణ, తాళ్లకుల నాగమణి, సాయిని సుజాత, షమీమ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ డి కైసర్, కోశాధికారిగా షాహేరా బేగం తోపాటు మరో 21 మందిని కార్యవర్గ సభ్యులుగా 63 మందితో కూడిన కౌన్సిల్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మ, అధ్యక్షురాలు పైడిపల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి షాహీన్ మాట్లాడుతూ పట్టణ మహాసభలో మహాసభలో పలు తీర్మాణాలకు ప్రతినిధులు ఆమోదం తెలిపారని, ప్రధానంగా అన్నిరంగాల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు, మహిళా చట్టాలకు రక్షణ, మహాలక్ష్మి పథకాల పూర్తి స్థాయి అమలు, బిసి రిజర్వేషన్, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వేధింపులు, పురుషులతో సమానంగా శ్రామిక మహిళలకు వేతనాల అమలుకోసం మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## ట్రిపుల్ ఐటీ సీట్ సాధించిన అంజలీ, అభినందించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కొత్తగూడెం ఆగస్టు 5 నవభూమి ప్రతినిధి:** బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 2024-25 విద్యా సంవత్సరం లో పదవ తరగతిలో 537 మార్కులతో ఉత్తీర్ణత పొందిన వట్టికొండ వేదశ్రీ నాగ అంజలీ ట్రిపుల్ ఐటి బాసర సాంకేతిక కళాశాలలో సీటు సాధించడం పట్ల కలెక్టర్ జితేష్ వి పాటిల్ విద్యార్థి అంజలీ ని అభినందించారు. అంజలీ తల్లిదండ్రులు వట్టికొండ మురళీ, కవిత లను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుని వెళుతున్న విద్యార్థులు పట్టణ ప్రాంతాల విద్యార్థులతో పోటీ పడి చదవాలన్నారు. ప్రత్యేకంగా బాబు క్యాంప్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.నీరజను, ఉపాధ్యాయులను అభినందించారు. ట్రిపుల్ ఐటీ సీటు సాధించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తన తరుపున బహుమతి గా డైరీ,పెన్ను, పర్సు లను అంజలీ కి కలెక్టర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, ఎ చందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

■ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్





**పాల్వంచ ఆగష్టు 5 నవభూమి ప్రతినిది:** రాష్ట్రంలో ఉపాధ్యాయలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్ సంఘాలు పాల్గొన్నాయి. ఈ ధర్నా కార్యక్రమానికి వీ వరలక్ష్మి, హరిలాల్ అధ్యక్ష వర్గంగా ఉండి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు టీఎస్ యుటిఎఫ్ నుండి ఎం వెంకటేశ్వర్లు, టిపిటిఎఫ్ నుండి బి రాజు పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు బదిలీలు చేపట్టాలని, అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని, 5, 571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలన్నారు. అదే విదంగా బిఈడి అర్హత కలిగిన వారికి కూడా ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు గా పదోన్నతి కల్పించాలని, 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయుల కు 12 నెలల వేతనం చెల్లించాలని, పెండింగ్లో ఉన్న ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పిఆర్సి నివేదిక తెప్పించుకొని 01-07-2023 నుండి అమలు చేయాలని, జీవో 25న సవరించి, ప్రాథమిక పాఠశాలలో ప్రతి 40 మందికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రమోషన్స్ సందర్భంగా ఉన్నటువంటి అన్ని ఖాళీలను ప్రదర్శించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు సమస్యల మెమోరాండం కాపీని అందించేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు టీఎస్ యుటిఎఫ్ నుండి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎం రాజయ్య, వి వరలక్ష్మి, జిల్లా కోశాధికారి ఎస్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ కృష్ణ, జిల్లా కార్యదర్శిలు ఆర్ రమేష్ కుమార్, ఎస్ విజయ్ కుమార్, బి రాంబాబు, బి రాము, ఎస్కే పాషా, ఆశాలత, సత్య శ్రీ , టిపిటిఎఫ్ సంఘం నుండి జిల్లా అధ్యక్షులు బి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిలాల్, గంగరాజు , హనుమంతు, ఉమాదేవి, ఆసియా సుల్తానా, రామ్ చంద్, నరసయ్య, రామరాజు, మాధవ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు భవిష్యత్తులో స్థిరపడటానికి ఒక గోల్ ఏర్పాటు చేసుకోవాలి

■ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్





**ఖమ్మం నగరం, నవభూమి, ఆగస్టు 5:** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న పీఎంహెచ్ హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులు చదువుతోపాటు భవిష్యత్తులో స్థిరపడటానికి ఒక గోల్ ఏర్పాటు చేసుకొని అనుకున్నది సాధించే వరకు పోరాడుతూనే ఉండాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం నాడు ఖమ్మం పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ పిఎంహెచ్ వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టానుసారంగా బయట తిరగకుండా దృష్టి ఎప్పుడూ చదువుపై పెట్టాలని, తీరిక సమయంలో లైబ్రరీలో ఉన్న పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి మనసులో ఏదో ఒక కోరిక ఉంటుందని జిల్లా కలెక్టర్గా, డాక్టర్ గా, ఉపాధ్యాయుడిగా ఏదో ఒక రంగంలో స్థిరపడి ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం ఉంటుందని అందుకు ఇప్పటినుండే దానికి సంబంధించిన శిక్షణలు తీసుకొని అనుకున్నది సాధించాలని అన్నారు. ఈ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ఉన్నత ఉద్యోగాల కొరకు ప్రేరణ పొందడానికి కోచింగ్ సెంటర్ మరియు లైబ్రరీలో విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు సమకూరుస్తామని అన్నారు. అనంతరం గిరిజన భవనం సందర్శించి ప్రస్తుతం ఉన్న నిధులతో గిరిజన భవనంలో టాయిలెట్, బాత్రూమ్స్, మంచినీటి సౌకర్యం ఏవైనా శు భకార్యాలు చేసుకోవడానికి అనువుగా ఉండేలా సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం ఖమ్మం పట్టణంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలు నెలకొల్పిన మహిళా మార్ట్ సందర్శించి మహిళా మార్ట్ లో అమ్మకాలు జరుపుతున్న వస్తువుల వివరాలు మరియు గ్రూప్ మహిళలకు ఆదాయ మార్గాలు ఏ విధంగా వస్తున్నవి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఖమ్మం డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని విజయలక్ష్మి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నారాయణరెడ్డి, వైరా ఏటీడీవో భారతీదేవి తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటీడీఏ పీవో



**ఖమ్మం కలెక్టరేట్, నవభూమి, ఆగస్టు 5:** కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని, భద్రాచలం ఐటిడిఎ పీవో బి. రాహుల్ మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

## ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతి పట్ల

### రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురైషి సంతాపం



**కొత్తగూడెం జూలై 5 నవభూమి ప్రతినిధి:** ఆదివాసి ఉద్యమ నేత జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతి పట్ల రాష్ట్ర మైనార్టీ నాయకులు ఉర్దూగర్ చైర్మన్ డాక్టర్ నయీమ్ ఖురైషి సంతాపం వ్యక్తం చేశారు.జార?ండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనలో,గిరిజన సమస్యల పరిష్కారంలో మడమ తిప్పని పోరాటం చేసిన యోధుడు గురూజీ శిబు సోరెన్ అని కొనియాడారు.మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరులోనూ శిబు సోరెన్ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు.చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు శిబు సోరెన్ మొదటి నుంచి మద్దతుగా నిలిచారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైతం చివరి వరకు ఆయన బలమైన వాదన వినిపించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు

## పరిశిక రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**గుండాల ఆగస్టు 5 నవభూమి:** గుండాల మండలం వెన్నెల బైలు గ్రామానికి చెందిన పర్శిక రాజు విద్యుత్ షాక్ తో అకాల మరణానికి గురయ్యారని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం గుండాల మండల కార్యదర్శి, గుండాల మాజీ సర్పంచ్ కోరం సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గుండాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే చేను పనుల కోసం వెళ్లి వచ్చే వాడని, విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వం స్పందించి నిరుపేద కుటుంబాని ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు

## కుర్చీలు వితరణ చేసిన యువకులు

**అన్నపురెడ్డిపల్లి ఆగస్టు 5 నవభూమి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని తాటి బుచ్చన్న గూడెం గ్రామంలో అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ పిలుపు మేరకు గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో కుర్చీల వితరణ చేసిన బుచ్చన్న గూడెం గ్రామ యువకులు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# ఆస్పిరేషన్ నుండి ఇన్స్పిరేషన్ జిల్లాగా మారాలి

### ■ కలెక్టర్ జితేష్ వి.పాటిల్



**కొత్తగూడెం జూలై 5 నవభూమి ప్రతినిధి:** జిల్లా ఆస్పిరేషన్ జిల్లాగా కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచే ఇన్స్పిరేషన్ జిల్లాగా రూపాంతరం చెందాలనే లక్ష్యంతో ప్రతి శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ బాటిల్ సూచించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రణాళిక అధికారి (సిపిఓ) సంజీవరావు అధ్యక్షత వహించగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సిపిఓ సంజీవరావు మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి లో భాగంగా జిల్లాలో వివిధ శాఖలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు విశేష కృషి చేస్తున్న కలెక్టర్ ను అధికారులు సన్మానించారు. అనంతరం,కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపు పొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం,నీతి అయోగ్ సంయుక్తంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ద్వారా జిల్లాలో అనేక రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని, ప్రతి ఉద్యోగి సమర్థంగా పనిచేయడంతోనే జిల్లా ఈ స్థాయికి చేరుకుందని కలెక్టర్ తెలిపారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అన్ని విభాగాల సమన్వయంతో కార్యాచరణ చేపడుతున్నామని, దీని ద్వారా జిల్లా దేశవ్యాప్తంగా ఆదర్శ జిల్లాగా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకుడు గుంతలు తవ్వాలి అనే పిలుపుతో జిల్లాలో చేపట్టిన సామూహిక కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల నుండి ప్రారంభమై జిల్లావ్యాప్తంగా విస్తరించి, దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పిల్లలలో పోషకాహార లోపం, ఎనీమియా వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మునగాకు వంటివి ఆహారంలో చేర్చడం ద్వారా ఎనీమియా రాకుండా నియంత్రించవచ్చని వివరించారు. వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జిల్లాలో అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహించి ఆహారపు అలవాట్లను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి స్మార్ట్ అంగన్వాడీలు, డిజిటల్ తరగతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వంటివి ఉపయోగపడుతున్నాయని, సిడిపిఓ, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. రేగళ్ల అంగన్వాడీ కేంద్రంలో గతంలో చీకటి, ఉక్క పోత వల్ల పిల్లలు రావడం తగ్గిపోయిందని, ఇప్పుడు విద్యుత్, ఫ్యాన్ వంటివి ఏర్పాటు చేయడం వల్ల పిల్లల హాజరు పెరిగిందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం మరియు ప్రతి పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ఉన్నటువంటి సమస్యలు, వాటి పరిష్కారాలను నివేదికల సమర్పించడం ద్వారా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని అన్నారు. దీని ద్వారా విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చు అని కలెక్టర్ తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి శాఖలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో సమన్వయంగా ముందుకు సాగాలని, ప్రతి కార్యక్రమాన్ని లక్ష్య ప్రాతిపదికన అమలు చేయాలని సూచించారు. భవిష్యత్తులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరు దేశవ్యాప్తంగా ఆదర్శ అభివృద్ధి జిల్లాగా వినిపించేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆకాంక్షిత అభివృద్ధి లక్ష్యాల్లో విశేష కృషి చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి ( రిటైర్డ్), ఉద్యోగులకు, సిబ్బందికి 133 మందికి మెడల్స్, ప్రశంసాపత్రాలు,మెమెంటోలు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. వారి సేవలను గుర్తించి మెచ్చుకోవడం ద్వారా మరింత ఉత్సాహంతో సేవలందించేందుకు ప్రతి ఉద్యోగి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.





## రెడ్డి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో

# శీలం కృష్ణారెడ్డికి ఆర్థిక సహాయం







**తల్లాడ, నవభూమి, ఆగస్టు 5:** తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన శీలం కృష్ణారెడ్డికి అంతుచిక్కని వ్యాధి సోకింది, తను సుతార్ మేస్త్రి గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ వ్యాధి వల్ల ఆర్థికంగా తన కుటుంబాన్ని పోషించటం చాలా ఇబ్బందిగా మారింది ఈ తరుణంలో ఈ విషయాన్ని తెలుసుకున్న రెడ్డి ఎంప్లాయిస్ యూనియన్ వారు శీలం కృష్ణారెడ్డిని తమకు తోచిన సహాయాన్ని రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో గ్రేట్ సభ్యులు దగ్గుల మాధవరెడ్డి, బొగ్గుల వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భీమిరెడ్డి కృష్ణారెడ్డి, అయిలూరీబాబు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, రఘుపతి రెడ్డి, సిద్ధార్థ రెడ్డి, చలపతి రెడ్డి, రామశేషిరెడ్డి, చారి, అజిత్ కుమార్ రెడ్డి, సాంబశివరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా కళారూపాలే ప్రజల్లో చైతన్యం కలిగిస్తాయి: వేముల కొండలరావు




**పాల్వంచ ఆగస్టు 5 నవభూమి ప్రతినిది:** ప్రజలు నిత్యం పాడుకునే పాటలు, జానపద కళారూపాలే ప్రజల్లో గొప్ప చైతన్యం కలిగిస్తాయని తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు అన్నారు. మంగళవారం పాల్వంచ పట్టణంలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి పాటల శిక్షణ శిబిరం నిర్వహించారు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు శనిగరపు శ్రీనివాసరావు అధ్యక్షతన, కార్యదర్శి కాటూరి రాము నేతృత్వంలో ప్రారంభమైన శిక్షణ శిబిరానికి 23 మంది కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ దేశంలో ప్రజానాట్య మండలి (ఇప్టా) పేరుతో 1943 సంవత్సరంలో బొంబాయిలో ప్రారంభమై స్వాతంత్రం కోసం జరిగిన అనేక ఉద్యమాలలో వివిధ రాష్ట్రాల్లో కళారూపాలతో ప్రజలను చైతన్య పరచిందని తెలిపారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేసిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రైతు మహా ఉద్యమంలో ఇప్టా కళా ప్రదర్శనలతో కార్యక్రమాలు నిర్వహించిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులుగా సీనియర్ కళాకారులు కె. రాందాస్, పాల్వంచ మండల అధ్యక్ష కార్యదర్శులు నిమ్మల రాంబాబు, కేలోత్ కృష్ణ, స్వరూప, కొమరయ్య, లక్ష్మి, రాజేశ్వరి, సంజీవరావు, సత్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో రాణింపుతో ఉజ్వల భవిష్యత్తు: చార్డ్ సంస్థ అధ్యక్షులు సామల బాబు



**కామేపల్లి, నవభూమి, ఆగష్టు 5 :** కామేపల్లి మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల లకు చెందిన 200 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్లు, సబ్బులు, కోల్గేట్ పేస్టు ను మంగళవారం పంపిణీ చేశారు. కామేపల్లి,ఊట్కూర్,జాస్తిపల్లి, ముచ్చర్ల,జింకలబంజర,సా తానిగూడెం గ్రామాలలోని 5-10 సంవత్సరాల విద్యార్థుల కు మంచినీరు,పరిశుభ్రత, మరుగుదొడ్డి, హైజీన్ పెంచేందుకూ రెండు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.అందులో భాగంగానే వాటర్ బాటిల్స్, సబ్బులు, కోల్గేట్ పేస్ట్ లను 200 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ ప్రోగ్రామ్ ను ఒంటరియో టీచర్స్ ఫెడరేషన్- ఇంటర్నేషనల్ అసిస్టెన్స్ కమిటీ, కెనడా వారి ఆర్ధిక సహకారంతో ఈ కార్యక్ర మాన్ని రూపొందించింది నిర్వహించారు.ఈ సందర్భంగా చార్డ్ సంస్థ చైర్మన్ సామల బాబు విద్యార్థుల హైజిన్ మెయింటెనెన్స్,శుభ్రమైన దుస్తులతో పాఠశాలకు రావడం కొరకు సంసిద్ధత వంటి అంశాలను వివరించా రు.చార్డ్ వైస్ చైర్మన్ గుడి చుట్టూ రామనాథం,సిహెచ్ రమేష్,ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జర్పుల రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయు లు,ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

# తిరుమలాయపాలెం మండల ప్రెస్‌క్లబ్ ప్రారంభం

■ ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్

**తిరుమలాయపాలెం నవభూమి ఆగస్టు 5 -**తిరుమలాయపాలెం మండలం లో గత ముప్పై సంవత్సరాల నుండి ప్రెస్ క్లబ్ లేక మండల ప్రజలు , ఎవరికి ఏ సమస్య వచ్చినా ఎవర్ని సంప్రదించాలి అనేది తెలవక సతమతమవుతున్న ప్రజలకు, తిరుమలాయపాలెం మండలంలోని జియో షోరూం పైన నూతన ప్రెస్ క్లబ్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించి తిరుమలాయపాలెం మండలం నూతన ప్రెస్ క్లబ్ ను ప్రారంభించారు, 109/2025 రిజిస్ట్రేషన్ గల ప్రెస్ క్లబ్ ను ప్రారంభం చేయడం జరిగింది, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బోడపట్ల సతీష్ గౌడ్ (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శి నవిలె. బాబు,(డి ఎన్ బి న్యూస్ ) గౌరవ అధ్యక్షులు కొత్త వెంకన్న, (క్యూ న్యూస్ )పప్పుల సుధాకర్ (మనతెలంగాణ ) ఉపాధ్యక్షులు పోలెపొంగు వెంకన్న, (నవభారత్ )కోశాధికారి గొర్రెపాటి శ్రీశైలం, (ఆర్ టి వి) ప్రెస్ క్లబ్ నెంబర్ కొండ్రు రమేష్, పోలేపొంగు. వెంకటేశ్వర్లు (టి. మీడియా) బి.రాజేష్(నవతెలంగాణ ) ఉమేష్,గంధసిరి సతీష్,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధులుగా అధికారులు ఎమ్మార్వో లూథర్ విల్సన్,డి టి . గుర్రం సుధీర్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, తిరుమలాయపాలెం పోలీస్ ఎస్సై కూచిపూడి జగదీష్, ఎంఈఓ శ్రీనివాసరావు, ఏపిఎం సంపత్ కుమార్,సీసీ బండ్ల నాగేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి,



పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ,మాజీ ఎంపీపీలు మంగీలాల్ నాయక్, కొప్పుల అశోక్,మండల అధ్యక్షులు బెల్లం శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్, ఓరా వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ అంబేద్కర్, వనవాసం నరేందర్ రెడ్డి , డీలర్ సయ్యద్ మదర్,సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బీఎస్పీ పార్టీ పాలేరు నియోజకవర్గం అధ్యక్షులు ఎన్నబోయిన రమేష్, కొమ్ము పూలే,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నం.రాజశేఖర్, పోట్ల కిరణ్, షేక్ కరీం, సుమన్ రెడ్డి, గోల్ తండా మాజీ సర్పంచ్ అనిల్ , అక్రమ్, బిఆర్ఎస్ పార్టీ గంట కృష్ణ, గుగ్గిళ్ళ అశోక్, గూగులోత్ సురేష్, క్రైట్స్ ఇన్స్టిట్యూట్ అధినేత వాంకు డోత్. తిరుపతి నాయక్ , సైపుఉద్దీన్, మాందాపురం మాజీ సర్పంచ్ నరసయ్య గౌడ్ పాల్గొన్నారు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన అన్ని పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు యువత అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.









# శ్రీవారి ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు





**ఎర్రుపాలెం, నవభూమి, ఆగస్టు5:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు మూడో రోజు మంగళ వారం జరిగిన పూర్ణహుతి,చక్ర స్నానంతో ముగిశాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ తెలిపారు.ఆలయంలో ఉదయం నుండి ప్రాతకాల అర్చనలు, యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై స్వామి వారికి అనుష్టములు హెూమములు నిర్వహించారు.అందులో భాగంగా స్వామివారి ఆలయానికి,ఉప ఆలయాలపై ఉంచిన పవిత్రాల విసర్జన, ప్రత్యేకపూజలు నిర్వహించారు.యాగ శాల వద్ద పూర్ణాహుతి కార్యక్రమం నిర్వ హించారు. యాగశాలలో పవిత్రోత్సవముల సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తు లను మేళతాళాలతో అర్చక స్వాములు స్వామివారి కోనేటి వద్దకుతీసుకొని పోయి ప్రత్యేకపూజకార్యక్రమాలునిర్వహించారు. అనంతరం స్వామి వారికి కోనేటిలో చక్ర స్థానం కార్యక్రమం నిర్వహించడంతో పవిత్రోత్సవములుముగిసినవి.గత మూడురోజులుగాపూజలు అందుకుంటు న్న పవిత్రములనుభక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు,పర్యవేక్ష కులు కే విజయ కుమారి,ఉప ప్రధానార్చ కులు వెంకటరమణ,మురలీమోహన్ శర్మ, రాజీవ్ శర్మ,వేద పండితులు,వార్షిక పవిత్రోత్సవములకు సహకరించిన బృందావనం వెంకట సుబ్బారావు, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పాలస్తీనా పసికందులపై ఇజ్రాయిల్ దాష్టీకం



కారేపల్లి, నవభూమి, ఆగస్టు5: పాలస్తీనాపై ఇజ్రాయిల్ రాకెట్ దాడులతో పసికందులు, మహిళలు బలవుతున్నారని ఐద్వా మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి విమర్శించారు. పాలస్తీనాపై అమెరికా ప్రోత్సహంతో ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ పాలస్తీనాకు సంఘీబావంగా ఐద్వా ప్రచారకార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా కారేపల్లిలో మంగళవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈసందర్బంగా కొండబోయిన ఉమావతి మాట్లాడుతూ పాఠశాలలో ఆసుపత్రులు జన సందోహాల పై యుద్ధ విమానాలు రాకెట్ దాడులు బాంబులు వర్షం కురిపిస్తూ ఇజ్రాయిల్ మారణ హోమాం సఋష్టిస్తుందన్నారు. యుద్దంలో ప్రజలు మృతి చెందటం, తినడానికి తిండి దొరకక ఆకలి చావులు పెరిగిపోతున్నాయన్నారు. ఇజ్రాయిల్ అమానుష్య చర్యలు ఖండిస్తూ పాలస్తీనా సంఘీభావంగా ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు పచ్చిపాల గురులక్ష్మి, జూపల్లి లక్ష్మి, శ్యామల, రమ్య మౌనిక ఇతరులు పాల్గొన్నారు

## విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు క్యాష్ రివార్డు



ఖమ్మం క్రైం, నవభూమి, ఆగస్టు 5: ఉత్సాహంతో పనిచేసే పోలీస్ సిబ్బందిని మరింత ప్రోత్సహిస్తామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఇటీవల జిల్లాలో గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కష్టపడి పనిచేసిన టాస్క్ ఫోర్స్ పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఎస్ కె. ఖాసింఅలీ, కానిస్టేబుల్ వి.గోపి, యం.సతీష్ లను పోలీస్ కమిషనర్ అభినందించి, క్యాష్ రివార్డు అందజేశారు. 33 గంజాయి కేసుల్లో 120 మంది నిందుతులను అరెస్ట్ చేయడంలో,192 కేజీల గంజాయి పట్టుకోవడంలో ఈ సిబ్బంది కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ రక్షణ కోసం అంకితభావంతో భాధ్యతలు నిర్వహిస్తూ మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ ఉదయ్ కుమార్, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

## తగినంత యూరియా సరఫరా

(1వపేజీ తరువాయి)వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతిగా రావాల్సిన యూరియాకు సంబంధించి షిప్ మెంట్ వివరాలు ఇంకా రాలేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా దేశీయ సంస్థలైన నుండి 11,000 మెట్రిక్ టన్నులు నుండి 7,000 మెట్రిక్ టన్నులు ఆగస్టులో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వారు సరఫరా చేయలేమని తెలియజేసినట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ విషయంలో కేంద్ర రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి జెపి నడ్డా గారిని తక్షణ చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా కోరారు. అదేవిధంగా ఈ ఆగస్టులో సరఫరా చేయలేమని చెప్పిన వల్ల ఏర్పడిన 18,000 మెట్రిక్ టన్నుల కొరతను ద్వారా భర్తీ చేయాలని మరియు ఆగస్టు నెలలో కేటాయించిన విధంగా రాష్ట్రానికి దిగుమతి ద్వారా అందాల్సిన 39,600 మెట్రిక్ టన్నుల యూరియాను ఈ నెల 20వ తేదీకి ముందు రాష్ట్రానికి చేరే నౌకల ద్వారా ఇవ్వాలని, దాంతో పాటు ఏప్రిల్ నుండి జూలై మధ్య ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరతను కూడా ఆగస్టు నెలలో మంజూరు చేయాలని లేఖ ద్వారా అభ్యర్థించారు.

# స్థానిక ఎన్నికల కోసం ఆశావాహులు ఎదురుచూపులు

### ■ ఎన్నికలకు వెళ్లడానికి ఆలోచనలో పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం



బూర్గంపాడు ఆగస్టు 5 నవభూమి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకుని సుమారు 20 నెలలు అయినప్పటికీ సర్పంచ్ లు, ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పటివరకు నిర్వహించకపోవడం వలన మండల, గ్రామ అభివృద్ధికి నోచుకోని పరిస్థితి కనపడుతుంది. ఎందువలన స్థానిక ఎన్నికలను నిర్వహించలేకపోతున్నారు. బీసీ కి 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, అప్పటి వరకు స్థానిక ఎలక్షన్ పెట్టె ఆలోచన లేదని కొందరు, లేదా ఇచ్చిన హామీలు సరిగా హమలు చేయలేదని మరి కొందరు. కాంగ్రెస్ లో కార్యకర్త నుండి సీఎం స్థాయి వరకు ఏక మనసు ఏకాభిప్రాయము ఐక్యత లోపం కనబడుతుందని అనడానికి ఇది నిదర్శనం. అంతర్గత వర్గ విభేదాలు స్పష్టంగా కనబడుతుంది. నేనే సీనియర్, నేనే సీనియర్ అని కొందరు. మరికొందరు నిన్నగాక మొన్న వచ్చిన వారు మాముందు పెత్తనం చలాయిస్తున్నారు అని మరికొందరు. అధికార దాహంతో కొందరు. కాంగ్రెస్ పుట్టిన దగ్గరనుంచి ఇప్పటివరకు కాంగ్రెస్లోనే కొనసాగుతుంటే కాంట్రాక్ట్ మాకు ఇవ్వటం లేదని వారే అన్ని లబ్ది పొందుతున్నారని ఐక్యత లోపం కనబడుతుంది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎన్నికలు వస్తే బూర్గంపాడు మండలంలో కాంగ్రెస్ హవా ఎలా ఉండబోతుంది. మండల నాయకులు పని తీరుపై ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇది ఐక్యతా లోపమా, వారి పనితీరు లోపమా? ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనూ, రైతు రుణమాఫీ విషయంలో కొంతమంది అర్హులకు న్యాయం జరగలేదని ప్రజలు మండిపడుతున్నారు. కొందరి అభిప్రాయము పార్టీ నేతలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఒంటెద్దు పోకడలకు వ్యవహారశీలుగా నడుస్తుందని, నేనే సీనియర్ని నా మాటే వినాలి నా మాటే శాసనమని దూకుడు గురవుతూ కలుపుకొని దొరణిలో వెళ్తూ పార్టీకి చెడ్డ పేరు తెస్తూ భ్రష్టు పట్టే వ్యవహారశీలుగా ఉన్నదని కొందరు అంటున్నారు. కష్టపడ్డ కార్యకర్తకు సరైన గౌరవం లేదని పార్టీకి దూరమవుతున్నట్లు పార్టీ కార్యక్రమాలకు రావటం లేదని ఇందుకు నిదర్శనంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన 20 నెలలు ఐనప్పటకి మండల నాయకుల్లో ఒక్కరైనా ఇప్పటివరకు ఇచ్చిన హామీలను ప్రజల్లోనికి అందరి కార్యకర్తలను కలుపుకొని ఏమేమి హామీలు ప్రభుత్వం అమలు చేసింది అని చెప్పగలిగారా? ప్రతీ ఇంటికి 200 యూనిట్లు ఫ్రీ కరెంటు, 500 కే గ్యాస్, ఇందిరమ్మ ఇల్లు, స్త్రీలకు ఉచిత బస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న బియ్యం, రేషన్ కార్డులు, వీటిని ప్రజల్లోకి తీసుకొని పోయే నాయకులు కరువయ్యారని వాపోతున్నారు? స్థానిక ఎన్నికలు వస్తే నేను పోటీలో ఉంటా అంటూ ముందుకు వస్తున్నారు కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుండి ఇప్పటివరకు ఇచ్చిన హామీలు ప్రజల్లోనికి తీసుకెళ్లలేకపోతున్నారు. బూర్గంపాడు మండలంలో వర్షాకాలంలో వచ్చిందంటే వరదల వలన ప్రజలు ముంపు ప్రాంత వాసులు భయభ్రాంతులకు గురవుతూ దినదినము బిక్కుబిక్కుమంటూ జీవిస్తూ ఉంటారు. ఎప్పుడు వరదలు వచ్చి వారి నివాసాలు మునిగిపోతాయని భయంతో జీవిస్తున్నారు. కిందటి రోజుల్లో ముంపుకు గురైన సమయంలో ఏ నాయకులు సహాయ సహకారాలు అందించారో ప్రజలు వారిని గుర్తుపెట్టుకుని వారినే తమ లీడర్స్ గా ఎన్నుకొనే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీలో ఐక్యత అంతర్గత లోపాలు వలన స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు కలిసోచ్చే అవకాశం ఉందని, కాంగ్రెస్లో ఐక్యత లోపం ఇతరుల పార్టీలకు బలంగా ఉండే ఉంటుందని వారు మాటల్లో తెలుస్తుంది. ఒకటి మాత్రం చెప్పగలం ఏ పార్టీ అయినా సరే కార్యకర్త ఎంత కష్టపడ్డా అధికారం వచ్చాక కష్టపడ్డ కార్యకర్తకు కాదు ముందుగా వారు గుర్తుపెట్టుకునేది ఎవరికి ఎక్కువ ధనముందో వారు ఎవరైనా సరే వారికే టికెట్ ఇచ్చే అవకాశం ఉంటుంది. వారే లీడర్లు. పార్టీ కోసం ప్రయాసపడ్డాడా లేదా అని చూడకుండా ఎన్ని సంవత్సరాలు నుండి పార్టీలో ఉండి కష్టపడుతున్నాడు అని కూడా చూడకుండా డబ్బు పెడితే చాలు మా పార్టీ వారే అని సంకలో గుద్దుకుంటూ వెళ్తూ ఉంటారు. అధికార దాహంతో పార్టీ లోనికి రావడం తప్ప పార్టీ కోసం ప్రజల కోసం వచ్చే వారు చాలా తక్కువగా ఉంటారు. పార్టీ నిలబడాలన్న, అధికారంలోనికి రావాలన్నా అది ఏ ఒక్కరి వల్ల సాధ్యం కాదు. సమిష్టి కృషి వల్లే వస్తుంది. సమిష్టి కృషి, ఐక్యత, అందర్నీ కలుపుకొని స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, జెడ్పిటిసి, ఎంపీటీసీలను కాంగ్రెస్ గెలిపించుకుంటుందో మరీ ప్రతిపక్ష పార్టీలు అవకాశమిస్తుందో వేచి చూడాలి. ప్రతిపక్ష పార్టీలు మాత్రం తగ్గేదే లేదు, ఎలాగైనా తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని ప్రచారం జోరుగా కొనసాగుతుంది. అభ్యర్థులను బట్టి ప్రజలు ఇచ్చే తీర్పును బట్టి గౌరవ ప్రదంగా కొంతకాలం వేచి ఉండాల్సి వస్తుంది. సమయం ఉంది కదా ఐక్యత లోపం అంతర్గత విభేదాలు సరిచేసుకొని కలుపుగోలుతో ముందుకు వెళ్తారో లేదో కాంగ్రెస్ నాయకులు, లీడర్లు, కార్యకర్తలు గమనించాల్సిన విషయం ఉంది.

# ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జరుపుకోవాలి

### ■ పాల్వంచ సొసైటీ అధ్యక్షులు రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల





పాల్వంచ ఆగస్టు 5 నవభూమి ప్రతినిధి: ఇందిరమ్మ గృహాలు మంజూరు అయిన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఇండ్ల నిర్మాణాలు జరపాలని పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్,రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురంలో ఇందిరమ్మ గృహాలకు మార్కింగ్ ఇచ్చి పనుల ప్రారంభం సందర్భంగా కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు 400 చదరపు అడుగుల వైశాల్యం పైన 600 చదరపు అడుగుల వైశాల్యం లోపల నిర్మాణం చేసుకోవాలన్నారు నిర్మాణం జరుపుతున్న వారికి బేస్మెంట్ లెవల్ కు 1లక్ష రూపాయలు, రూఫ్ లెవెల్ 1 లక్ష రూపాయలు, స్లాబ్ లెవల్ కు 2 లక్షలు, నిర్మాణం పూర్తి అయిన తరువాత 1 లక్ష రూపాయలు బిల్లు మంజూరు అవుతాయన్నారు. దీనిలో విధిగా మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. ఇంటి నిర్మాణానికి 10 ట్రిప్పులు ఇసుకకు కూపన్లు ఉచితంగా ఇస్తారన్నారు. జగన్నాధపురం పంచాయతీకి 29 గృహాలు మంజూరు అయ్యాయని లబ్దిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మండల పంచాయతీ అధికారి వై చెన్నకేశ్వర రావు, హౌసింగ్ ఏఈ సిహెచ్ రమేష్, బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ఆర్టిఏ మెంబర్ బాదర్ల జోషి కుమార్, మాజీ జడ్పిటిసి మాలోతు నందా నాయక్, కాంగ్రెస్ నాయకులు కొండం పుల్లయ్య, బానోత్ బాలాజీ, బానోత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.